
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
మంగళవారం 17 డిసెంబరు 2024



46వ రోజుకు చేరిన రిలే దీక్షలు

తలకొండపల్లి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు సోమవారం 46వ రోజుకు చేరాయి. దీక్షలకు మద్దతుగా గ్రామంలో వివిధ పార్టీలు, సంఘాల నాయకులు, మహిళలు, యువకులు ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రం ఏర్పాటుకు స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ప్రభుత్వ పరంగా సహకరించాలని జేఏసీ నాయకులు కోరారు. జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్లు శరత్‌చంద్ర, ఆంజనేయులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



గజగజ

- ఉమ్మడి జిల్లాలో అత్యల్ప ఉష్ణోగ్రతలు
- ఎలిమినేడు, బంట్వారంలో 6.7 డిగ్రీలు నమోదు

రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాపై చలి పంజా విసిరింది. ఉన్నట్టుండి ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పడిపోయాయి. సోమవారం మరింతగా క్షీణించాయి. చలి తీవ్రతకు తోడుగా పొగమంచు కురుస్తుండటంతో ప్రయాణికులకు ప్రాణసంకటంగా మారింది. రాత్రి పూట ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతున్నాయి. పగటి పూట ఉష్ణోగ్రతలు సైతం క్రమంగా తగ్గుతున్నాయి. ఉదయం 10 గంటల వరకు చాలా ప్రాంతాల్లో పొగ మంచు కప్పేస్తోంది. పొంగ మంచు కారణంగా రహదారులపై వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రానున్న రోజుల్లో మరింత చలి పెరిగే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఉష్ణోగ్రతలు పడిపోయిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. బయటకు వెళ్లే సమయంలో ముదురు రంగు దుస్తులు ధరించాలని తెలిపారు. చిన్న పిల్లలు, వృద్ధులు వేడి పానియాలు తీసుకోవాలంటున్నారు. అస్తమ రోగులు బయటకు వెళ్లే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు.

జిల్లాలో అత్యల్పం

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఎలిమినేడు, వికారాబాద్ జిల్లా బంట్వారంలో అత్యల్పంగా 6.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మేడ్చల్ జిల్లా ఉప్పల్ మండలం మౌలాలిలో 7.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగత నమోదైంది.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి


దివ్యాంగులను సన్మానిస్తున్న అధికారులు

రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పథకాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి, సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురిని సత్కరించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగులకు అన్ని కార్యాలయాల్లో తగిన వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు నర్సింహాచారి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



నూతన ఉపాధ్యాయులు	
రంగారెడ్డి	వికారాబాద్
192	307
వేతనాలు వచ్చిన మండలాలు	
00	07

తొలి వేతనం ఎప్పుడో?

కొత్త ఉపాధ్యాయుల ఎదురుచూపులు

ఎంతో ఆశగా ఉద్యోగంలో చేరిన నూతన ఉపాధ్యాయులకు రెండు నెలలు పూర్తయినా వేతనాలు అందడం లేదు. నేటికీ వారు తొలి జీతానికి నోచుకోలేదు. పలువురు టీచర్లు బదిలీల కౌన్సెలింగ్‌లో ఇతర పాఠశాలలకు బదిలీ అయినా విద్యాబోధనలో ఇబ్బందులు తలెత్తకుండా కొందరిని వారు పని చేస్తున్న పాఠశాలల్లోనే కొనసాగించారు. అలాంటి చోట కొత్త ఉపాధ్యాయులను కేటాయించగానే వారు అక్కడి నుంచి రిలీవ్ అయ్యారు. ఇలాంటి పరిస్థితులు నెలకొన్న పాఠశాలల్లో చేరిన కొత్త ఉపాధ్యాయులకు వేతనం బిల్లులు చేయడంలో సాంకేతిక పరమైన ఇక్కట్లు ఎదురవుతున్నట్లు తెలుస్తోంది. అయితే, కొన్ని మండలాల్లోని ఉపాధ్యాయులకు జీతాలు రావడం.. మరికొన్ని చోట్ల రాకపోవడం కొత్త చర్చకు దారి తీస్తోంది. కాగా, రంగారెడ్డి జిల్లాలో 192 మంది.. వికారాబాద్‌లో 307 మంది కొత్త టీచర్లు విధుల్లో చేరారు.

- ఉద్యోగంలో చేరి రెండు నెలలు పూర్తి
- అక్టోబరు 10నుంచి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు
- 16వ తేదీన విధుల్లో చేరిక
- వేతనం ఎప్పటి నుంచి ఇవ్వాలనే విషయంలో అస్పష్టత!
- ఆర్థికశాఖ గ్రీన్‌సిగ్నల్ వస్తేనే వేతనాలు
- రంగారెడ్డిలో 192 మంది..
- వికారాబాద్‌లో 307 మంది టీచర్లు

వికారాబాద్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థులకు అక్టోబరు 9న ఎల్బీ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి నియామక పత్రాలు అందజేయగా, 10న వారు తమ జిల్లాల్లో డీఈవోకి రిపోర్ట్ చేశారు. ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థులకు 16న కౌన్సెలింగ్ నిర్వహించి పాఠశాలలను కేటాయించారు. 17న వారు తమకు కేటాయించిన పాఠశాలల్లో విధుల్లో చేరారు. వీరికి అక్టోబరు 10 నుంచి వేతనం బిల్లు చేయాలా? లేక 16వ తేదీ నుంచి చేయాలా అనే విషయమై స్పష్టత లేని కారణంగా వేతనాలు విడుదల కాలేదనే వాదన వినిపిస్తోంది. బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు 15వ తేదీ వరకు, కొత్తగా నియామకమైన ఉపాధ్యాయులకు 10వ తేదీ నుంచి వేతనం బిల్లులు చేయలేని పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో రిపోర్ట్ చేసిన రోజు నుంచి కొత్త ఉపాధ్యాయులు విధుల్లో చేరినట్లుగా ప్రభుత్వం పరిగణిస్తుందని

మిగతా 7వ పేజీలో...

ఎన్నిక

యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా గోపాల్‌నాయక్

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. షాద్‌నగర్ ఠాగూర్ ఆడిటోరియంలో రెండు రోజుల పాటు నిర్వహించిన యూటీఎఫ్ జిల్లా 6వ మహాసభలో ఆదివారం రాత్రి కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా కరెంటోత్ గోపాల్‌నాయక్, ప్రధాన కార్యదర్శిగా మొదినె వెంకటప్ప, ఉపాధ్యక్షులుగా బింగి రాములయ్య, ఎన్.కల్పన, కోశాధికారిగా డాక్టర్ పి.జగన్నాథ్‌శర్మ, జిల్లా కార్యదర్శులుగా కె.వెంకటయ్య, కె.కిషన్ చౌహాన్, జి. భగవంతురాజ్, వై.రామకృష్ణ, జి.శివారెడ్డి, డాక్టర్ బి. భువనేశ్వరి, ఎన్.నర్సింహులు, బి.బుగ్గ రాములు, శ్యామలాదేవి, కె.శంకర్‌నాయక్, పి.మల్లేష్, ఎండీ అక్బర్‌లను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. అనంతరం 13 తీర్మానాలను కమిటీ ఆమోదించింది.

కార్యదర్శిగా రాములయ్య

తలకొండపల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శిగా తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బొడ్డుపల్లి రాములయ్య ఎన్నికయ్యారు. షాద్‌నగర్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన టీఎస్‌యూటీఎఫ్ జిల్లా మహాసభలో సోమవారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శిగా రాములయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపులు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని, 317 జీవో సమస్యను పరిష్కరించాలని, ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ వెంటనే ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

వసతి గృహాల నిర్మాణం చేపట్టాలి

- నిధులు మంజూరైనా నిర్మించడం లేదు
- చేవెళ్ల ప్రాంతంపై ప్రభుత్వానికి చిన్నచూపు
- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీ
- ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం



6

రోడ్డు విస్తరణలో జాప్యం

- హైదరాబాద్-బీజాపూర్ రహదారిపై నిత్యం ప్రమాదాలు
- ఎన్‌హెచ్ఏఐ తీవ్ర నిర్లక్ష్యం
- పట్టించుకోని పాలకులు, అధికారులు



8

వంట కార్మికుల సమ్మె

- బకాయిలు చెల్లించాలని డిమాండ్
- పాఠశాలల్లో మిడ్‌డే మీల్స్ బంద్
- ఇంటి నుంచి బాక్సులు తెచ్చుకుంటున్న విద్యార్థులు



8

హైవే విస్తరణకు ఉద్యమిస్తాం

- బీఆర్ఎస్ యువజన రాష్ట్ర నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న కార్తీక్‌రెడ్డి

చేవెళ్ల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులపై కోర్టు ఇచ్చే తీర్పు ప్రకారం ఉద్యమించేందుకు సన్నద్ధం అవుతున్నామని బీఆర్ఎస్ యువజన రాష్ట్ర నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి తెలిపారు. సోమవారం చేవెళ్ల మండల కేంద్రంలో డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, పలువురు పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారి రోడ్డు విస్తరణపై అడుగడుగునా అబద్దాలు ప్రచారం చేస్తూ పనులు జరగకుండా చేస్తున్నారని చెప్పారు. రోడ్డు విస్తరణ పనులు సాగకపోవడంతోనే చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 13వ తేదీన స్వయంగా చెన్నై ఎన్జీటీలో ఉన్న కేసు విచారణకు కొంతమంది నాయకులతో కలిసి వెళ్లితే అసలు నిజాలు తెలుసుకోవడం జరిగిందన్నారు. అక్కడ జరిగిన వాదనలు కేసు వివరాలను బట్టి చూస్తే ఈ రోడ్డు నిర్మాణంలో జాప్యం ప్రభుత్వాలదే అని స్పష్టంగా తెలుస్తుందన్నారు. ఎన్జీటీ కోర్టు అడిగిన సరైన నివేదికలను అధికారులు అందించకపోవడంతోనే మరింత జాప్యం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికీ సరైన రిపోర్టులు ఇవ్వకలేకపోయిందన్నారు. కోర్టు తీర్పు అనుకూలంగా రాకపోతే మాత్రం ఈ రోడ్డు పనులు ఇప్పట్లో జరిగే అవకాశం ఉండదని, దీనిపై ఉద్యమ కార్యచరణ త్వరలోనే ప్రకటిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో చేవెళ్ల నియోజకవర్గం సీనియర్ నాయకుడు దేశమోళ్ల అంజనేయులు, మండల అధ్యక్షుడు ప్రభాకర్, యూత్ అధ్యక్షుడు వంగ శ్రీధర్‌రెడ్డి, మండల నాయకులు వై.కృష్ణ, చంద్రశేఖర్‌రెడ్డి, తోట చంద్రశేఖర్, విగ్నేష్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, రాజు, మాణిక్యరెడ్డి, సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు శేరి శివారెడ్డి తదితరులు ఉన్నారు.

సీనియర్ నేతలకు అన్యాయం

మంచాల, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పదవుల్లో సీనియర్ నేతలకు అన్యాయం జరుగుతోందని కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు గుండెమోని జయమ్మ అన్నారు. సోమవారం జరిగిన పార్టీ మండల ముఖ్యనేతల సమావేశంలో గుండెమోని జయమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు విజమూరి రాంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెదిరె హన్మంత్‌రెడ్డి, డైరెక్టర్ జెనిగె వెంకటేష్‌యాదవ్, మాజీ ఎంపీటీసీలు ఎడమ నరేందర్‌రెడ్డి, వాజీద్, జయానందం హాజరై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. పార్టీలో సీనియర్ నేతలకు ప్రాధాన్యత కరువైందని విమర్శించారు. ఇకనుంచి మండల కమిటీ సిఫారసు మేరకు పదవులు కేటాయించేలా చూడాలన్నారు.

అర్జీలు సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి


ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణి అర్జీలు పెండింగ్‌లో పెట్టకుండా సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందించి పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 52, ఇతర శాఖలవి 15, మొత్తం 67 దరఖాస్తులు అందాయని తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి చేయాలి

ఇందిరమ్మ ఇళ్ల పథకం సర్వేను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ.. సర్వేను ప్రణాళికా పరంగా నిర్వహించాలన్నారు. మార్గదర్శకాలను పాటిస్తూ తప్పిదాలకు తావులేకుండా వివరాలను సేకరిస్తూ యాప్‌లో నమోదు చేయాలన్నారు. నూతనంగా ప్రవేశపెట్టిన డైట్‌ను సంక్షేమ హాస్టల్స్, రెసిడెన్షియల్ పాఠశాలలో పక్కాగా అమలు చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమీసింగ్, అధికారులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు

పెండింగ్ బిల్లులు చెల్లించాలని ధర్నా

రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు, వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో 48గంటల పాటు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకం యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు వై.స్వప్న, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ జి.కవిత మాట్లాడుతూ.. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న బిల్లుల తోపాటు వేతనాలు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. చాలీచాలని వేతనాలతో కార్మికులు కాలం నెట్టుకొస్తున్నారని వాపోయారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, నర్సింహ, శేఖర్, బాలరాజు, అలివేలు, గణేశ్, స్వాతి, విరేష్, సావిత్రి, అక్కమ్మ, రంగమ్మ, లక్ష్మమ్మ ఉన్నారు.

ముగిసిన గ్రూప్-2 పరీక్షలు

- ఆలస్యంగా వచ్చిన నలుగురు అభ్యర్థులు
- ఇబ్రహీంపట్నంలో ముగ్గురు మొయినాబాద్‌లో ఒకరు
- అనుమతించని అధికారులు
- శంషాబాద్ శ్రీచైతన్య పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్


ఇబ్రహీంపట్నంలో గర్భిణిని పోలీస్ వాహనంలో పరీక్షా కేంద్రానికి తీసుకెళ్తున్న సీఐ మధు

రంగారెడ్డి అర్బన్/ఇబ్రహీంపట్నం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజుల పాటు నిర్వహించిన గ్రూప్-2 పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా ముగిశాయి. ఆది, సోమవారాల్లో నాలుగు పేపర్ల పరీక్షలు నిర్వహించారు. జిల్లాలో 90 పరీక్షా కేంద్రాల్లో 56,883 మంది అభ్యర్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా.. చాలా మంది అభ్యర్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు. ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు మొదటి పేపర్, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండో పేపర్ పరీక్ష నిర్వహించారు. అభ్యర్థులను పరీక్షకు ఉదయం 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. 9.30 గంటల తర్వాత గేట్లు మూసి వేశారు. ఆలస్యంగా వస్తే అభ్యర్థులను అనుమతి లేదు. ఇబ్రహీంపట్నం శ్రీఇందు కళాశాల పరీక్ష కేంద్రం వద్ద ముగ్గురు, మొయినాబాద్ మండలంలోని కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల పరీక్ష కేంద్రం వద్ద ఆలస్యంగా వచ్చిన ఓ మహిళను లోపలికి అనుమతించలేదు. ఇబ్రహీంపట్నం పరిధిలో 24 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. రెండో రోజు 16,584 మంది అభ్యర్థులకు గాను 7,270 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కాగా 9,314 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. మొయినాబాద్ మండంలో 7 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. 5,504 మంది అభ్యర్థులకు గాను 1,425 మంది పరీక్షలు రాశారు. 4,079 మంది గైర్హాజరయ్యారు. శంషాబాద్‌లోని శ్రీచైతన్య పాఠశాల పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ సి.నారాయణరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా అభ్యర్థుల హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు.

శ్రీఇందు ఇంజనీరింగ్ కళాశాల పరీక్షా కేంద్రానికిం పరీక్ష రాయడానికి ఓ గర్భిణి వచ్చారు. ఆమెను గేటు నుంచి పరీక్ష కేంద్రంలోకి మంచాల సీఐ మధు పోలీస్ వాహనంలో తీసుకెళ్లారు. ఏసీపీ కేపీవీ రాజు పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తును పర్యవేక్షించారు.

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన

రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని తెలిపారు. ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్రాణాలు కోల్పోయిన ఉద్యోగులకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియో ప్రకటించాలన్నారు. ధర్నాకు సీఐటీయూ, ధర్మసమాజ్ పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు తదితరులు ఉన్నారు.


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

ఆశావర్కర్ల వేతనాలు పెంచండి

● శాసన మండలిలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి



షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కరోనా కష్టకాలంలో సైతం ప్రజలకు సేవలందించిన ఆశా వర్కర్ల వేతనాలను పెంచాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్‌కుమార్‌రెడ్డి కోరారు. ఈమేరకు శాసన మండలిలో సోమవారం ఎమ్మెల్సీ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ఆశా వర్కర్లకు పెంచిన రూ.10వేల వేతనాన్ని రూ.18వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఆశా వర్కర్ల వేతనాలను రూ.18 వేలకు పెంచుతామని హామీ ఇచ్చి, వారితో ఓట్లు వేయించుకుందన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా వేతనాలు పెంచని ప్రభుత్వాన్ని అడగడానికి వచ్చిన ఆశా వర్కర్లను పోలీసులు విచక్షణారహితంగా కొట్టారని, బాధ్యులైన పోలీసులపై నేటికీ చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఆశా వర్కర్ల వేతనాన్ని రూ.18వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులు తరచూ అనారోగ్యానికి గురవుతున్నారని గుర్తుచేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించి, ఆరోగ్యంగా చదువుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని నవీన్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు.

13 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత!

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకందాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధి మంగల్‌పల్లి సమీపంలో ఓ గోడౌన్‌పై పోలీసులు దాడులు చేసి అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 13 టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పౌర సరఫరాల శాఖ అధికారులు కూడా అవి రేషన్ బియ్యం అని ధ్రువీకరించినట్లు సమాచారం. కాగా, బియ్యాన్ని ఇబ్రహీంపట్నంలోని పౌర సరఫరాల గోడౌన్‌కు తరలించినట్లు సమాచారం. కాగా, విచారణ కొనసాగుతోందని.. మంగళవారం వివరాలు వెల్లడించనున్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు.

‘ఉత్తమ సర్పంచ్, ఎంపీటీసీ’ అవార్డుల ప్రదానం

బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో అందజేత



అవార్డు అందుకుంటున్న శ్రీనివాస్, సత్యనారాయణచారి, లచ్చిరెడ్డి, పెంటయ్యగౌడ్

చేవెళ్ల, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రావులపల్లి మాజీ సర్పంచ్ కేసారం శ్రీనివాస్‌కు బహుజన సాహిత్య అకాడమీ నుంచి అంతర్జాతీయ ఉత్తమ సర్పంచ్ అవార్డు అందుకున్నారు. అలాగే అల్లావాడ మాజీ ఎంపీటీసీ సత్యనారాయణచారి కూడా ఉత్తమ ఎంపీటీసీ అవార్డును అందుకున్నారు. ఈమేరకు ఆదివారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఇద్దరూ అవార్డులు అందుకున్నారు. సమాజ సేవకు అంకితమైన 27 రాష్ట్రాలకు చెందిన ప్రజాప్రతినిధులకు ఈ అవార్డులను బహుజన సాహిత్య అకాడమీ 17వ నేషనల్ కాన్ఫరెన్స్‌లో భాగంగా నిర్వాహకులు.. సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సుబ్రమణ్యన్ తదితరులు అవార్డులు అందజేశారు.

లచ్చిరెడ్డికి అబ్దుల్‌కలాం అవార్డు

మంచాల, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధి తాళ్లపల్లిగూడకు చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు జి.లచ్చిరెడ్డి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ అవార్డు అందుకున్నారు. వివిధ రంగాల్లో సేవలందించినందుకు బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో పురస్కారం అందించారు. జనసందేశ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జి.లచ్చిరెడ్డి చేపట్టిన సేవా కార్యక్రమాలను పరిగణలోకి తీసుకొని అవార్డుకు ఎంపిక చేశారు.

పెంటయ్యగౌడ్‌కు ‘కర్షకరత్న’

చేవెళ్ల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డమీది పెంటయ్యగౌడ్‌ను కర్షకరత్న అవార్డు వరించింది. బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి డాక్టర్, సుబ్రమణియన్ తదితరుల చేతుల మీదుగా పెంటయ్యగౌడ్‌కు అవార్డును ప్రదానం చేశారు. అవార్డు మరింత బాధ్యతను పెంచడంతో పాటు చాలా సంతోషంగా ఉందని పెంటయ్యగౌడ్ తెలిపారు. మండల ప్రజలు, వివిధ పార్టీల నాయకులు పెంటయ్యగౌడ్‌కు అభినందనలు తెలిపారు. చేవెళ్ల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బి.రాములు, డైరెక్టర్ పడాల రాములు, తదితరులు ఉన్నారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్యాయత్నం

● కాపాడిన పోలీసు సిబ్బంది
● కానిస్టేబుల్‌ను అభినందించిన ఉన్నతాధికారులు, గ్రామస్తులు



ప్రశాంతి ఉరేసుకోకుండా నిలువరిస్తున్న కానిస్టేబుల్ చిరంజీవి

కందుకూరు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ మహిళ ఆత్మహత్యాయత్నం చేయగా.. కుటుంబ సభ్యులు డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో పెట్రో మొబైల్-1 సిబ్బంది ఆమె ప్రాణాన్ని కాపాడారు. మండలంలోని నేదునూరుకు చెందిన బొర్ర రమేష్‌కు కొన్నేళ్ల క్రితం ప్రశాంతితో వివాహం జరిగింది. వీరికి ఒక బాబు ఉన్నాడు. రెండేళ్ల క్రితం రమేష్ అనారోగ్యంతో మృతిచెందాడు. ప్రశాంతి బాబును సాకుతూ నేదునూరు ఉన్నత పాఠశాలలో ఆయాగా పనిచేస్తూ జీవనం సాగిస్తోంది. ఈక్రమంలో ప్రశాంతి బావ గణేష్, తోటి కోడలు కరుణ తరచూ ప్రశాంతిని మానసికంగా ఇబ్బంది పెట్టేవారు. దాంతో మనస్తాపానికి గురైన ప్రశాంతి.. ఆదివారం రాత్రి 11గంటలో సమయంలో వంటగదిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంటున్నానని బేగంపేటలో ఉండే తన అక్క కుమారుడు విఘ్నేష్‌కు ఫోన్ చేసింది. దాంతో అతడు వెంటనే డయల్ 100 కు సమాచారం ఇచ్చాడు. కందుకూరు పెట్రో మొబైల్-1 కానిస్టేబుల్ చిరంజీవి, డ్రైవర్ శ్రీశైలంలు సంఘటనా స్థలానికి చేరుకోగా అప్పటికే ప్రశాంతి ఉరేసుకొని కొనఊపిరితో ఉంది. వెంటనే కానిస్టేబుల్ చిరంజీవి ప్రశాంతి మెడలో ఉన్న చీరను తొలగించి ప్రాణాన్ని కాపాడాడు.ఆత్మహత్య చేసుకుంటే కుమారుడు ఏమైపోతాడని ఆమెకు కౌన్సిలింగ్ ఇచ్చి కందుకూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించాడు. సోమవారం ఉదయం సీఐ సీతారాం.. ప్రశాంతికి విఘ్నేష్‌తో పాటు బంధువుల మధ్య కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు. కానిస్టేబుల్ చిరంజీవి, డ్రైవర్ శ్రీశైలంను సీఐ అభినందించారు. నేదునూరు గ్రామస్తులు పోలీసు సిబ్బందిని అభినందించారు.

మాదాసి కురుమలను ఎస్సీ-ఏ జాబితాలో చేర్చండి



వినతిపత్రం ఇస్తున్న విఠలయ్య తదితరులు

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మాదాసి కురుమలను ఎస్సీ-ఏ జాబితాలో చేర్చాలని మాదాసి-మాదారి కురుమ సంఘం షాద్‌నగర్ తాలుకా అధ్యక్షుడు సిందం విఠలయ్య కోరారు. ఈమేరకు సోమవారం ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య విచారణ కమిషన్ చైర్మన్ డాక్టర్ షమీమ్ అక్తర్‌ను నగరంలోని బీఆర్కే భవన్‌లో కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా విఠలయ్య ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు కమిషన్ చైర్మన్‌కు మాదాసి, మాదారి కురుమలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సమస్యలను వివరించారు. మాదాసి, మాదారి కురుమలను ఎస్సీ ఏ జాబితాలో చేర్చి, రిజర్వేషన్ ఫలాలను అందిస్తేనే అభివృద్ధి చెందుతారని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నత్తి శివరాములు, బండల లక్ష్మయ్య, కొయ్యల నర్సింహులు, బి.బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్యకు పరిష్కారం

యాచారం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో మురుగు కాలువల పనితీరు దారుణంగా ఉందని, మురుగు కారణంగా జనం దోమలతో వేగలేకపోతున్న వైనంపై సోమవారం ‘ఆంధ్రజ్యోతి’లో పారిశుధ్యం.. అస్తవ్యస్తం అనే శీర్షికన ప్రచురించిన కథనానికి ఎంపీడీవో నరేందర్‌రెడ్డి స్పందించారు. నానక్‌నగర్‌లో రైతులు పొలాలకు మురుగు నీరు రాకుండా అడ్డుకట్ట వేయడంతో సమస్య ఉత్పన్నమైనట్లు ఎంపీడీవో తెలిపారు. సమస్యను త్వరలో పరిష్కరించనున్నట్లు చెప్పారు. అదేవిధంగా తాటిపర్తి గ్రామంలో ఆయన పర్యటించి సమస్యలు తీరుస్తామన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రాష్ట్ర ప్రభుత్వంపై ఆరోపణలు తగదు

కడ్తాల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సర్పంచ్‌ల పెండింగ్ బిల్లుల పాపం గత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు సర్పంచ్‌ల పెండింగ్ బిల్లుల గురించి పట్టించుకొని అప్పటి ఆర్థిక మంత్రి హరీశ్‌రావు అసెంబ్లీలో సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులపై మొసలి కన్నీరు కార్చడం, వాకౌట్ చేయడం హస్యాస్పదంగా ఉందన్నారు. కడ్తాల మండల కేంద్రంలో సోమవారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యనాయక్ కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేళ్ల అధికారంలో ఉండి సర్పంచ్‌ల సమస్యలు పట్టించుకోలేదని తెలిపారు. సర్పంచ్‌లకు బిల్లులు చెల్లించకుండా ఇబ్బందులకు చేసిందని, సర్పంచ్‌లు ఆత్మహత్యలకు కారణమైంది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆరోపించారు. కేంద్రం నిధులు దారి మళ్లించి సర్పంచ్‌లను ఇబ్బందులకు గురిచేసిందన్నారు.

అంతర్గత రోడ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి



పనులను ప్రారంభిస్తున్న చైర్మన్ చంద్రారెడ్డి

కీసర రూరల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): అంతర్గత రోడ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి తెలిపారు. నాగారం మున్సిపల్ పరిధిలోని 19, 20వ వార్డుల్లో మంగళవారం రూ.15లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేసారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్ సుర్వి శ్రీనివాస్‌గౌడ్, అన్నంరాజ్ సురేష్ పాల్గొన్నారు.

సెల్లార్ తవ్వకాలు, మట్టితరలింపుపై విచారించాలి

ఘట్‌కేసర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ పరిధిలోని యంనంపేట్‌లో నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్ తవ్వకాలు, మట్టి తరలింపు, ప్లాట్లను ఆక్రమించి రోడ్లు నిర్మిస్తున్న వ్యాపారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మెట్టు గణేష్ సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. యంనంపేట్ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 90లో మూడెకరాల స్థలంలో సెల్లార్ పేరుతో మట్టి తవ్వి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. సర్వేనెంబర్ 90పార్టులో గరుడాద్రి రియల్ ఎస్టేట్ సంస్థ గతంలో రోడ్డుకు అనుకుని ప్లాట్లను ఆక్రమించి 100అడుగుల రోడ్డుగా చూపించి హెచ్ఎండీఏనూ తప్పుదోవ పట్టిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఆక్రమాలపై ఆయా శాఖల అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని వాపోయారు. తిరిగి మున్సిపల్ కమిషనర్‌కు, తహసీల్దార్‌కు మరోసారి ఫిర్యాదు చేసినట్లు శ్రీనివాస్‌రెడ్డి, గణేష్ తెలిపారు.

వసతి గృహాల నిర్మాణం చేపట్టాలి



వినతి పత్రం అందిస్తున్న నాయకులు

చేవెళ్ల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బాలికలు, బాలుర కోసం చేవెళ్లలో కళాశాల వసతి గృహాలు నిర్మించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం చేవెళ్ల మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ఆర్డీవో కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందించారు. నాయకులు అరుణ్ కుమార్, శ్రీనివాస్‌లు మాట్లాడుత 2018లో చేవెళ్లలో ఎస్సీ బాలికలు, బాలుర వసతి గృహాలు మంజూరైనా నిర్మాణాలు చేపట్టడం లేదన్నారు. చేవెళ్ల ప్రాంతంపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందన్నారు. ఇప్పటికైనా భవనాలు నిర్మించాలని కోరారు. నాయకులు కుమార్, నవీన్, శివ, సందీప్, ఆసిఫ్, అనిల్ తదితరులు ఉన్నారు.

ఇష్టానుసారంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే!

- బీఆర్ఎస్, కాంగ్రె్సకు వలస వచ్చిన కౌన్సిలర్ల పరిస్థితి దారుణం
- పేరుకే సర్వే కమిటీ చైర్మన్ల ఏర్పాటు
- గత పాలకుల మాదిరిగానే వ్యవహారం

ప్రజాప్రతినిధులకు అందని సమాచారం

వికారాబాద్, డిసెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వే ఇష్టానుసారంగా మారిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈపథకం వికారాబాద్ మునిసిపల్‌లో లాంఛనంగా ప్రారంభమైంది. మునిసిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్ తన సొంత వార్డు సుభాష్‌నగర్ నుంచి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అయితే ఈసర్వేలో ఒక ఇందిరమ్మ కమిటీని ఎన్నుకున్న తరువాత వార్డులో పేదలను గుర్తించి అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులుగా గుర్తించనున్నారు. అయితే ఇందులో వార్డు కౌన్సిలర్ చైర్మన్‌గా, మునిసిపల్ సిబ్బంది ఒకరు వార్డుకు చెందిన మహిళలను ఈ కమిటీలో చేరుస్తారు.

కౌన్సిలర్లకు లేని సమాచారం

ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో బీఆర్ఎస్ కౌన్సిలర్లకు కానీ, వలస వచ్చిన కొందరు కాంగ్రెస్ కౌన్సిలర్లకు కానీ ఎలాంటి సమాచారం ఇవ్వడంలేదు. దీంతో పేరుకే కౌన్సిలర్లు చైర్మన్లుగా నియమించారని, వారికి తెలియకుండానే కొందరు కమిటీ ఏర్పాటు చేసి వారికి నచ్చిన పేర్లు రాసుకుని సర్వేకు సిద్ధమవుతున్నారు. మెజార్టీ బీఆర్ఎస్ కౌన్సిలర్లకు ఇప్పటికీ సమాచారం లేదు. ఒకరిద్దరికి సమాచారమున్నా కేవలం ఫొటోలకు ఫోజులివ్వడానికే తప్పా వారు ఎలాంటి నిర్ణయాలు తీసుకునే అవకాశాన్ని కల్పించడంలేదని బీఆర్ఎస్ కౌన్సిలర్లు వాపోతున్నారు. వార్డులో కాంగ్రెస్ నాయకులు చెప్పిందే వేదం అన్నట్లుగా వ్యవహరిస్తుండగా కాంగ్రెస్ ముఖ్యనేత సైతం ఆయావార్డు వ్యవహారాల్లో తలదూరుస్తూ కౌన్సిలర్లను చిన్నచూపు చూస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.


సుభాష్ నగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల (ఫైల్)

పట్టణంలో 34 వార్డులు

వికారాబాద్ పట్టణంలో మొత్తం 34వార్డులు ఉండగా బీఆర్ఎస్11 మంది, కాంగ్రెస్ 20మంది, బీజేపీ నుంచి ఒకరు, ఎంఐఎం నుంచి ఒకరు ప్రాతినిథ్యం వహిస్తున్నారు. బీఆర్ఎస్ కౌన్సిలర్ ఒకరు మృతి చెందారు. మొత్తంగా 33 మంది కౌన్సిలర్లు పరిపాలన సాగిస్తున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడడంతో చాలా మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్ వైపు వెళ్లారు. ఎన్నికల కంటే ముందు చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌తో పాటు మరో ముగ్గురు కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లగా, ఎన్నికల తరువాత ఐదుగురు కౌన్సిలర్లు బీఆర్ఎస్ వీడి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లారు. అయితే వారికి ప్రస్తుతం పార్టీలో ప్రాధాన్యత లేక సతమతమవుతున్నారు.

అంతర్గత విభేదాలు

గతంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలోనూ నాయకులు అధికారం కోసం ఆరాటపడటంతో అంతర్గత విభేదాలు తలెత్తాయి. దీంతో వికారాబాద్ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో స్వప్రయోజనాలే లక్ష్యంగా పార్టీ నేతలు ముందుకెళ్తున్నట్లు తెలుస్తోంది. నేటికీ మున్సిపాలిటీ నేతల మధ్య అంతర్గత విభేదాలు తొలగడంలేదు. ఇళ్ల సర్వేలో కూడా కనీసం కౌన్సిలర్లకు సమాచారం లేక పోవడం ఏమిటని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సర్వే ప్రక్రియ సజావుగా నిర్వహించి అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

మాకు ఎలాంటి సమాచారం లేదు



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియ మంచి పథకం. అయితే ఈ పథకంలో వార్డు కౌన్సిలర్లు చైర్మన్‌గా ఉండాల్సి ఉంది. నేను కాంగ్రెస్ కౌన్సిలర్ అయినా నాకు ఎలాంటి సమాచారం లేదు. కమిటీలు కూడా నేను ఇచ్చిన పేర్లు కాకుండా కొందరికి నచ్చిన పేర్లను పెట్టుకున్నారు. అలాంటప్పుడు కౌన్సిలర్‌ను చైర్మన్‌గా ఉంచాల్సిన అవసరం ఏముంది.

- నవీన్ కుమార్, కాంగ్రెస్ శివరాంనగర్ కాలనీ కౌన్సిలర్, వికారాబాద్

బీఆర్ఎస్ కౌన్సిలర్లపై చిన్నచూపు



బీఆర్ఎస్ కౌన్సిలర్లను అసలు పట్టించుకోవడం లేదు. నావార్డులో ఇందిరమ్మ ఇళ్ల సర్వే విషయం నాదృష్టికి తీసుకురాలేదు. కౌన్సిలర్ చైర్మన్‌గా ఉండాల్సి ఉన్నా మాకు సమాచారం ఇవ్వకుండా కమిటీలను ఎలా ఏర్పాటు చేస్తారు. సంక్షేమ పథకాల విషయంలో పార్టీల వారీగా పనిచేస్తే అర్హులకు పథకాలు ఎలా అందుతాయి.

- కొండేటి కృష్ణ, బీఆర్ఎస్ కౌన్సిలర్, వికారాబాద్

పక్షపాత ధోరణిలో అధికారులు

పలువురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు తాము చైర్మన్లుగా ఉండాల్సిన పథకంలో మరొకరి పెత్తనం ఏమిటని అధికారులను ప్రశ్నిస్తే రూలింగ్‌లో ఉన్నవారు చేసుకుంటారంటూ ఉచిత సలహా ఇస్తున్నట్లు బీఆర్ఎస్ కౌన్సిలర్లు చెబుతున్నారు. ప్రజల కోసం పనిచేయాల్సిన అధికారులు సైతం రూలింగ్ పార్టీ వైపు మాట్లాడడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు.


శిఖర ప్రతిష్ఠ వేడుకల్లో స్థానిక నాయకులు

ఘనంగా శిఖర ప్రతిష్ఠ వేడుకలు

కడ్తాల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని హనుమాన్ ఘాట్ వద్ద గల ఆంజనేయస్వామి దేవాలయంలో సోమవారం శిఖర ప్రతిష్ఠ వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ నేపథ్యంలో దేవాలయాన్ని పచ్చటి తోరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. కడ్తాలకు చెందిన సిరిగి రమేశ్ దంపతులు శిఖరాన్ని సమకూర్చి ఆలయ నిర్వాహకులకు అందజేశారు. అర్చకుడు వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, నాయకులు పాల్గొన్నారు.


జాతీయ రహదారిపై బోల్తా పడ్డ లారీ

అదుపుతప్పిన చెరుకు లారీ బోల్తా

- తప్పిన పెను ప్రమాదం
- షాబాద్ సమీపంలో ఘటన

షాబాద్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): అదుపుతప్పి చెరుకు లోడ్ లారీ బోల్తా పడ్డ సంఘటన షాబాద్ గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. షాబాద్ మండల కేంద్రానికి సమీపంలో ముంబై-బెంగళూరు జాతీయ రహదారి(లింక్ రోడ్డు)పై చెరుకు లోడ్‌తో వెళుతున్న లారీ అదుపు తప్పి బోల్తాపడింది. కాగా, డ్రైవర్, క్లీనర్‌కు ఎలాంటి ప్రాణ హాని జరగలేదు. సోమవారం మరో లారీని తెప్పించి చెరుకును లోడ్ చేసి పంపించారు.


జైపాల్ యాదవ్‌ను సన్మానిస్తున్న స్వాములు

సన్మార్గంతోనే దైవానుగ్రహం

- మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

ఆమనగల్లు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): సన్మార్గంతోనే దైవానుగ్రహం లభిస్తుందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయాన్ని సోమవారం జైపాల్ యాదవ్ సందర్శించారు. ఆలయంలో మాజీ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో జరిగిన ఆంజనేయ స్వాముల ఇరుముడి కార్యక్రమంలో జైపాల్ పాల్గొన్నారు. స్వాములు ఆయనను సత్కరించారు. మాజీ జడ్పీటీసీ అనురాధా పత్యనాయక్, నాయకులు నిరంజన్‌గౌడ్, గుత్తి బాలస్వామి, ప్రశాంత్ నాయక్, రమేశ్‌నాయక్, ఆనంద్, మహేశ్, రవి, గురుస్వామి శ్రీకాంత్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పాఠశాలలో గణిత మేళా

కొడంగల్ రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):మండలంలోని హస్నాబాద్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం గణిత మేళా నిర్వహించారు. విద్యార్థులు గణితంపై చార్ట్‌లను తయారు చేసి ప్రతిభ కనబర్చగా వారికి ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం క్రాంతికుమార్, ఉపాధ్యాయురాలు సంధ్య పాల్గొన్నారు.


గోదాం పనులను పరిశీలిస్తున్న చైర్మన్, వైస్ చైర్మన్లు

గోదాం నిర్మాణ పనుల పరిశీలన

బషీరాబాద్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నవాంద్గి సొసైటీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న గోదాం నిర్మాణ పనులను చైర్మన్ ఎ.వెంకట్‌రాంరెడ్డి సోమవారం పరిశీలించారు. సొసైటీ భవనం పక్కన రూ.56లక్షల వ్యయంతో 1000 మెట్రిక్ టన్నుల నిల్వ గల గోదాం నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఆయన వెంట వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్ తదితరులున్నారు.


డెయిరీ ప్రొడక్ట్స్‌ను ప్రారంభిస్తున్న మహేందర్‌రెడ్డి

ప్రతి ఒక్కరూ స్వశక్తితో ఎదగాలి

మొయినాబాద్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రతీఒక్కరు స్వశక్తితో ఎదగాలని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. మండలానికి చెందిన ముజాహిద్ ఎంఎం డెయిరీ ప్రొడక్ట్స్‌ను సోమవారం మాజీ సర్పంచ్ అంగేరి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏరాజ్‌పాష, బాబా షఫీయొద్దీన్, షానవాజ్ హుసేన్, ఇనాయత్ అలీ, శ్రీనివాస్, అజీజ్, సోహేల్, ముజీబ్, రాములు పాల్గొన్నారు.

తొలి వేతనం ఎప్పుడో?

(ఐదో పేజీ తరువాయి)

రాష్ట్ర మంత్రులు, విద్యా శాఖ ఉన్నతాధికారులు ఎల్బీ స్టేడియంలో ఉద్యోగ నియామక పత్రాలు అందజేసే కార్యక్రమంలో ప్రకటించిన విషయం తెలిసిందే.

ఐడీ నంబర్లు ఇవ్వడంలో జాప్యంతోనే..

అక్టోబరు నెలలో జిల్లాలో కొత్తగా విధుల్లో చేరిన ఉపాధ్యాయుల్లో కొందరికి అక్టోబరు, నవంబరు నెల వేతనాలు వచ్చాయి. జిల్లాలో కోట్‌పల్లి, యాలాల్, పెద్దేముల్, దోమ, మర్పల్లి, మోమిన్‌పేట్, పరిగి తదితర మండలాల్లో పనిచేస్తున్న కొత్త ఉపాధ్యాయులకు వేతనాలు రాగా.. మిగతా మండలాల్లో పనిచేస్తున్న వారు వేతనాల కోసం ఎదురుచూస్తున్నట్లు సమాచారం. ఒక మండలంలో విధులు నిర్వహిస్తున్న వారికి వేతనం అంది మిగతా మండలాల్లో పనిచేస్తున్న వారికి రాకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఎంప్లాయిూ ఐడీలు, పాన్ నంబర్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో కొందరికి త్వరగా జనరేట్ కాకపోవడం కూడా ఓ కారణమనే ప్రచారం జరుగుతోంది.

ఆర్థిక శాఖ గ్రీన్ సిగ్నల్ ఇస్తేనే..

కాగా, కొత్త ఉపాధ్యాయులకు అక్టోబరు 10వ తేదీ నుంచి వేతనం బిల్లు చేయాలా? లేక 16 నుంచి చేయాలా అనే విషయమై స్పష్టత లేని కారణంగా కొన్ని మండలాల్లో కొత్త ఉపాధ్యాయుల వేతనాల బిల్లులు చేయలేదని సమాచారం. కొత్త ఉపాధ్యాయ అభ్యర్థులను అక్టోబరు 10వ తేదీ నుంచి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తున్నామని ప్రభుత్వం ప్రకటించి ఆ మేరకు నియామక పత్రాలు జారీ చేయగా.. పాఠశాలల్లో మాత్రం అదేనెల 16వ తేదీన చేరిన విషయం తెలిసిందే. అక్టోబరు 10 నుంచి కొత్త ఉపాధ్యాయులు విధుల్లో చేరారనే అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందని, ఆర్థిక శాఖ ధ్రువీకరించిన తర్వాతనే కొత్త ఉపాధ్యాయులకు వేతనాలు వస్తాయని ఉపాధ్యాయ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కొత్తగా నియామకమైన ఉపాధ్యాయులకు వేతనాలు విడుదల చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల నేతలు కోరుతున్నారు.



వేతనాలు వెంటనే చెల్లించాలి



రాష్ట్రంలో నూతనంగా నియామకమైన ఉపాధ్యాయులు విధుల్లో చేరి రెండు నెలల పూర్తయినా చాలా మండలాల్లో వారికి వేతనాలు చెల్లించకపోవటం బాధాకరం. ఇది అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ఠ. అక్టోబరు 10 నుంచి ఉపాధ్యాయుల నియామకం అమల్లోకి వస్తుందని.. సాక్షాత్తూ సీఎం ప్రకటించినా వేతనాలు చెల్లించకపోవటం గమనార్హం. రెండు నెలలు గడుస్తున్నా అధికారులు రకరకాల కారణాలు చూపుతూ ఇప్పటికీ చాలా చోట్ల వేతనాలు చెల్లించలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలి.

-పి.సత్యనారాయణ రెడ్డి, టీయూటీఎఫ్, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు


డీఎస్పీ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

బోర్డు తిప్పేసిన చిట్‌ఫండ్ కంపెనీ

- డీఎస్పీకి బాధితుల ఫిర్యాదు

పరిగి రూరల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): పరిగిలోని ఎస్‌ఎల్‌ఎన్ చిట్‌ఫండ్ కంపెనీ తమను మోసం చేసిందని పలువురు బాధితులు వాపోయారు. సదరు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని బాధితులు సోమవారం పరిగి డీఎస్పీ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పరిగి పట్టణ కేంద్రంలోని ఎస్ఎల్ఎన్ చిట్‌ఫండ్ కంపెనీలో స్థానికులు పలువురు చిట్టి వేశారు. ప్రతీనెల క్రమం తప్పకుండా చిట్టి డబ్బులు కడుతున్నారు. తీరా చిట్టి ఎత్తిన తర్వాత చిట్టి డబ్బులు ఇచ్చేందుకు తప్పించుకున్నారని, ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయడంలేదని వాపోతున్నారు. ఎప్పుడు చూసినా కార్యాలయానికి తాళం వేసి ఉంటుందని, తాము కట్టిన డబ్బులు ఎవరిస్తారో తెలియడంలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు ఆఫీస్ అద్దె కట్టడం లేదని, తనతో కూడా చిట్టి వేయించుకుని డబ్బులు ఇవ్వడం లేదని ఇంటి యజమాని చెప్పుకొచ్చాడు. గతంలోనూ కొంతమందికి చిట్టి ఎత్తిన వారికి డబ్బులు ఇవ్వకపోవడంతో పోలీసులను ఆశ్రయించగా ఎస్ఎల్ఎన్ కంపెనీ బోగస్ చెక్కులు ఇచ్చి మోసం చేసిందని వాపోయారు. కాగా ఎస్ఎల్ఎన్ చిట్‌ఫండ్ మేనేజర్ దేవేందర్‌గౌడ్ పక్కాప్రణాళిక ప్రకారమే తమ నుంచి డబ్బులు వసూలు చేసి మోసానికి పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.కోట్ల రూపాయల స్కాం చేశారని వాపోయారు. తమను మోసం చేసిన చిట్‌ఫండ్ నిర్వాహకుడిపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజాపాలనకు ఆకర్షితులై కాంగ్రె్సలో చేరిక

- మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి


బీఆర్ఎస్ నాయకులకు కండువాలు కప్పి కాంగ్రె్సలోకి ఆహ్వానిస్తున్న కేఎల్లార్

మహేశ్వరం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలనకు ఆకర్షితులై ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రె్సలో చేరుతున్నారని, మహేశ్వరం నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్లార్) అన్నారు. సోమవారం మహేశ్వరం మండలం ఉప్పుగడ్డతండాకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాజునాయక్ ఆధ్వర్యంలో తుక్కుగూడలోగల పార్టీ కార్యాలయంలో ఆయన సమక్షంలో కాంగ్రె్సలో చేరారు. కేఎల్లార్ కాంగ్రెస్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు చేరవేయడంలో కార్యకర్తలు కృషి చేయాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి మహేశ్వరం నియోజకవర్గాన్ని రాజకీయాలకతీతంగా అభివృద్ధి చేసుకుందామన్నారు. ఇందిరమ్మ కమిటీల ద్వారా అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలను చేరవేస్తామన్నారు. శ్రీనివాస్, రవి, భరత్‌నాయక్, సూర్య, రాజునాయక్ తదితరులున్నారు. కాగా, నియోజకవర్గం యువజన కాంగ్రెస్, ఎస్సీసెల్ నాయకులు కేఎల్లార్‌ను కలిసి శాలువాతో సన్మానించారు. ఆయన మాట్లాడుతూ దళితులకు అసైన్డ్, సీలింగ్ భూములు ఇచ్చిన ఘనత ఇందిరాగాంధీకే దక్కిందన్నారు. యువజన కాంగ్రెస్ నాయకులు శ్రీధర్, రాజు తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తాండూరు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆయన సోమవారం తాండూరులో మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నేడు(మంగళవారం) సీఐటీయూ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ఈనెల 20 తర్వాత సమ్మె చేపడతామని హెచ్చరించారు. జీవో నంబర్ 51ను వెంటనే సవరించాలని కోరారు.

సీపీఐ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

శంషాబాద్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ చరిత్రను ప్రజలకు వివరించడానికి ప్రతీ కార్యకర్త ముమ్మరంగా ప్రచారం నిర్వహించాలని, సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తికావస్తున్న సందర్భంగా ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. ఈమేరకు సోమవారం ఆయన శంషాబాద్‌లోని ఎలైట్ హోటల్ ఆవరణలో వందేళ్ల ఉత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ పార్టీ వంద సంవత్సరాల చరిత్రతో పాటు పేదలకు అందించిన సేవలు, సమస్యలపై పోరాడిన సందర్భాలు, వివిధ కార్యక్రమాలను తెలియజేసేందుకు చేవెళ్ల, ఎల్బీనగర్ ప్రాంతాల్లో భారీ బహిరంగ సభలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా మండల కేంద్రాల్లో సభలతో పాటు ప్రదర్శనలు నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, ముత్యాల యాదిరెడ్డి, ఓ.యాదయ్య, సామిడి శేఖర్‌రెడ్డి, టి. రామకృష్ణ, బాతరాజు నర్సింహ, ఎం.ప్రభులింగం, ఆర్. యాదగిరి, ఎం.రియాజ్, లక్ష్మణ్, నర్రా గిరి, చందు, సైదులు తదితరులు పాల్గొన్నారు.


దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్లు అందిస్తున్న మహేశ్‌బాబు

సదరం సర్టిఫికెట్లు అందజేత

దోమ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఎంపీడీవో మహేశ్‌బాబు సోమవారం దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్లను అందజేశారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా వచ్చిన సర్టిఫికెట్లను లబ్ధిదారులకు అందించినట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు జ్యోతి, ఏపీయం సురేశ్, ఎంఈవో వెంకట్, మంజుల, సుజ్ఞాని, అంజమ్మ పాల్గొన్నారు.



అనాథ చిన్నారులకు కౌన్సిలర్ ఆర్థిక సాయం

శంషాబాద్ రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్సీ కులాల అధ్యక్షుడు కోగంటి నర్సింహ ఆధ్వర్యంలో అనాథ చిన్నారులకు చేయూతను అందించారు. సోమవారం శంషాబాద్ మండలంలోని తొండుపల్లిలో అనాథ చిన్నారుల కోసం 11వ వార్డు కౌన్సిలర్ పారేపల్లి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ రూ.32వేల చెక్కును నర్సింహకు అందించారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో కొబ్బరికాయల విక్రయాలకు వేలం

కేశంపేట, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేముల్‌నర్వ గ్రామ శివారు నంబయ్య గుట్టపై వెలిసిన వేణుగోపాల స్వామి ఉత్సవాల్లో భాగంగా కొబ్బరికాయలు విక్రయించడానికి నేడు(మంగళవారం) వేలం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు గ్రామ పంచాయతీ ఆవరణలో వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వ్యాపారులు వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

రోడ్డు విస్తరణలో జాప్యం

- తరచూ ప్రమాదాలు.. పట్టని అధికారులు
- హైదరాబాద్-బీజాపూర్ రహదారిపై నిత్యం ప్రమాదాలు

మొయినాబాద్ రూరల్, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణలో ఎన్‌హెచ్ఏఐ తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. ఈ మార్గంలో వందేళ్లకు పైబడిన మర్రిచెట్ల తరలింపులోనూ తగిన ప్రణాళిక లేకపోవడంతో పనుల సాగడం లేదు. ఫలితంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో అమాయకుల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. వికారాబాద్ జిల్లా మన్నెగూడ నుంచి పరిగి మీదుగా రాష్ట్ర సరిహద్దు వరకు రోడ్డు విస్తరణ పూర్తయ్యింది. ఎన్‌హెచ్ఏఐ నిర్లక్ష్యంతో తెలంగాణ పోలీసు అకాడమీ నుంచి మన్నెగూడ వరకు దాదాపు 46కిలోమీటర్లు విస్తరించాల్సిన రోడ్డు పనుల్లో మాత్రం ఎడతెగని జాప్యం చోటుచేసుకుంటోంది. కాగా, పర్యావరణవేత్తలు గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారని, ప్రస్తుతం కేసు నడుస్తోందని చెబుతూ పనులు చేపట్టడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మరమ్మతులూ కరువు!

పోలీసు అకాడమీ నుంచి మన్నెగూడ వరకు రహదారి జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ పరిధిలో ఉంది. జాతీయ రహదారి కాకముందు ఈ మార్గం హైదరాబాద్, వికారాబాద్ ఆర్అండ్‌బీ డివిజన్లలో కొనసాగింది. గుంతలను తరచూ పూడ్చడం, అవసరమైతే తారు మిక్చర్‌తో నింపి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేసేవారు. 2018లో నేషనల్ హైవేగా ప్రకటించిన తర్వాత బాగోగులన్నీ ఎన్‌హెచ్ఏఐ పరిధిలోకి వెళ్లడంతో.. కనీస మరమ్మతులకు నోచుకోవడం లేదు. దీనికితోడు మలుపులను సరిచేసేందుకు ప్రపంచబ్యాంకు రూ.59కోట్లు ఇవ్వగా.. మలుపులను గుర్తించిన హైదరాబాద్ డివిజన్ ఆర్అండ్‌బీ యంత్రాంగం వాటిని సరిచేయకుండానే నిధులను కరిగించారనే ఆరోపణలున్నాయి. ఇక రెండు వరుసలుగా ఉన్న రహదారిని లంగర్‌హౌస్ సమీపంలోని టిప్పుఖాన్ వంతెన నుంచి పోలీసు అకాడమీ వరకు రూ.26 కోట్లతో నాలుగు లేన్ల రేడియల్ రోడ్డుగా నిర్మించగా.. రెండో దశలో సెంట్రల్ రోడ్డు ఫండ్ రూ.10కోట్లతో మొయినాబాద్ వరకు నాలుగు లేన్లుగా విస్తరించారు. మధ్యలో విభాగినులు ఏర్పాటు చేశారు. ఆ తరువాత అధికారులు పట్టించుకోలేదు.



ఎన్కేపల్లి చౌరస్తా సమీపంలో ఇరుకుగా ఉన్న మొయినాబాద్-చేవెళ్ల రోడ్డు

రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలి



హైదరాబాద్-బీజాపూర్ రోడ్డు విస్తరణ పనులు వెంటనే ప్రారంభించాలి. ఇటీవల కాలంలో ఈ రోడ్డుపై అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. శని, ఆదివారాల్లో రోడ్డు రద్దీగా ఉంటుంది. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో ఎక్కువగా ఇంజనీరింగ్ కళాశాలలున్నాయి. విద్యార్థుల రాకపోకలు ఈ రోడ్డు గుండానే సాగిస్తుంటారు. ఇక్కడి నుంచి నిత్యం అనేక మంది నగరానికి వెళ్తుంటారు. ఎప్పుడూ ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి.

- వన్నాడ శివకుమార్, కనకమామిడి గ్రామం

క్రైం కార్నర్

రెండు ఇళ్లలో చోరీ

- 8 తులాల బంగారం, 4 కిలోల వెండి ఆభరణాలు, రూ. 7లక్షల నగదు, ద్విచక్రవాహనం అపహరణ

షాబాద్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): రెండు వేర్వేరు ఇళ్లలో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడిన ఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి కథనం మేరకు.. షాబాద్ మండల కేంద్రంలో కొండ సుధీర్ నివాసం ఉంటున్నాడు. ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేరని గ్రహించిన దుండగులు.. ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న తులం బంగారం, 4 కిలోల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. అదేవిధంగా రవూఫ్ అనే వ్యక్తి కుమారుడి పెళ్లి చేసేందుకు బంగారు ఆభరణాలు, ఇతర సామగ్రి ఇంట్లో పెట్టి బట్టలు కొనేందుకు హైదరాబాద్‌కు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న 7 తులాల బంగారం, రూ.7లక్షల నగదును ఎత్తుకెళ్లారు. అలాగే షాబాద్‌కు చెందిన యాదగిరి అనే వ్యక్తి టీవీఎస్ ఎక్స్‌ఎల్ మోటార్‌సైకిల్‌ను అపహరించారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో క్లూస్‌టీం ఆధారాలు సేకరించింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

యాచారం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని వ్యక్తి మరణించిన ఘటన సోమవారం రాత్రి యాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని నందివనపర్తిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం గుర్తు తెలియని వ్యక్తి(40) యాచారంలో వైన్‌షాపు పక్కన ఉన్న దుకాణంలో పని చేసేవాడు. ఆ వ్యక్తి నందివనపర్తి బస్టాండ్‌లో ఉన్నట్టుండి ఫిట్స్‌తో కింద పడిపోగా చుట్టుపక్కల వారు ఆసుపత్రికి తరలించేందుకు యత్నించగా అప్పటికే మరణించాడు. మృతదేహంపై తెల్లటి ప్యాంటు, షర్టు ఉన్నాయని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నర్సింహరావు తెలిపారు.

రూ.లక్ష స్కూటీ 20వేలకే ఇస్తామని మోసం

- సైబర్ నేరగాడిని నమ్మి రూ.20వేలు పోగొట్టుకున్న మహిళ
- రాచకొండ సైబర్‌క్రైం పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు

యాచారం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల మాయమాటలను విశ్వసించి ఓ మహిళ రూ.20వేలు పోగొట్టుకున్న ఉదంతం మండలంలోని మాల్ గ్రామంలో వెలుగులోకి వచ్చింది. బాధిత మహిళ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మాల్‌కు చెందిన హరిణికి రెండు రోజుల క్రితం ఓ ఆగంతుకుడు ఫోన్‌చేసి రూ.లక్ష విలువైన స్కూటీని కేవలం రూ.వేలకే ఇస్తున్నామని నమ్మించాడు. మీకు వాహనం కావాలంటే మా స్కానర్‌కు డబ్బు పంపాలని కోరాడు. దుండగుడి మాటలు నమ్మి రూ.20వేలు పంపింది. సోమవారం మళ్లీ ఫోన్‌చేసి స్కూటీ కావాలంటే మరో రూ.3వేలు పంపించాలని అడిగాడు. అయితే, రూ.20వేలు పంపామని, మళ్లీ డబ్బు కావాలంటున్నారని ప్రశ్నించింది. దాంతో ఆగంతుకుడు.. మీకు వాహనం కావాలా? వద్దా? అని దబాయించాడు. మరో రూ.3వేలు పంపించాలని అడిగాడు. దాంతో మోసపోయామని తెలుసుకున్న ఆ మహిళ రాచకొండ సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

వ్యక్తి ఆత్మహత్య

ఆమనగల్లు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చంద్రధన గ్రామానికి చెందిన బంగాగళ్ల యాదయ్య (28) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల మేరకు.. తలకొండపల్లి మండలం చంద్రధనకు చెందిన యాదయ్యకు మూడేళ్ల క్రితం కేశంపేట మండలం నిర్దవెల్లికి చెందిన మమతతో వివాహం జరిగింది. కొంత కాలంగా యాదయ్య మానసికంగా ఇబ్బంది పడుతున్నాడు. ఈనెల 10న యాదయ్య తన భార్యను నిర్దవెల్లిలోని ఆమె పుట్టింటిలో ఉంచి ఇంటికి వచ్చాడు. అదే రోజు రాత్రి ఇంట్లో ఎవరు లేనిది చూసి ఒంటిపై పెట్రోలు పోసుకొని నిప్పంటించుకున్నాడు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న యాదయ్యను కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం హైదరాబాద్‌లోని గాంధీకి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి యాదయ్య మృతిచెందాడు. మృతుని సోదరుడు శ్రీకాంత్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

వైభవంగా మహా పడిపూజ



ర్యాలీలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు, భక్తులు

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప నామస్మరణతో షాద్‌నగర్ పట్టణం మార్మోగింది. షాద్‌నగర్ శివ మారుతి గీతా అయ్యప్ప మందిరంలో ఆదివారం రాత్రి అయ్యప్ప మహా పడిపూజ కనుల పండువలా నిర్వహించారు. శివ మారుతి గీతా అయ్యప్ప మందిరం కమిటీ ఆధ్వర్యంలో జరిగిన మహాపడి పూజకు వేలాదిగా అయ్యప్ప భక్తులు హాజరైనారు. స్థానిక పరిగి రోడ్డులోని పోచమ్మ దేవాలయం నుంచి శివ మారుతి గీతా అయ్యప్ప మందిరం వరకు కన్నె స్వాములు దీపారాధనతో ర్యాలీ నిర్వహించారు. విద్యుత్తు దీపారాధన కాంతుల మధ్య పట్టణం దద్దరిల్లేలా కేరళ వాయిద్యం, అయ్యప్పల నామస్మరణతో ర్యాలీ కొనసాగింది. గురుస్వామి గిరీష్ సతీషన్‌నాయర్ నేతృత్వంలో సోమవారం తెల్లవారు జాము వరకు భజనలు చేస్తూ మహాపడిపూజను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, మాజీ చైర్మన్ అగ్గనూరి విశ్వం, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డిలతో పాటు ఆలయ కమిటీ అధ్యక్షుడు లష్కర్ అంజనేయులు, గౌరవ అధ్యక్షుడు మోముల బసప్ప, ప్రధాన కార్యదర్శి రేటికల్ నందీశ్వర్, కోశాధికారి దాస కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో పొరపాట్లకు తావివ్వొద్దు



నుచ్చుగుట్ట తండాలో ఇళ్ల సర్వేలో మున్సిపల్ కమిషనర్ వసంత

ఆమనగల్లు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దని ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్ వసంత అన్నారు. ప్రభుత్వ మార్గనిర్దేశాలను అనుసరించి సర్వేలో పూర్తి పారదర్శకత పాటించాలని ఆమె సూచించారు. ఆమనగల్లు మున్సిపాలిటీ 3వ వార్డు నుచ్చుగుట్ట తండాలో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సర్వే కార్యక్రమాన్ని చేపట్టారు. మున్సిపల్ చైర్మన్ రాంపాల్ నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య లతో కలిసి కమిషనర్ వసంత సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించారు. సర్వ ఆదారంగానే లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టనుందున సర్వేలో అలసత్వానికి తావివ్వొద్దన్నారు. ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను సర్వే అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి మొబైల్ యాప్ ద్వారా ఆన్‌లైన్ నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని తెలిపారు. దరఖాస్తుల పరిశీలనకు వస్తున్న అధికారులు, సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణనాయక్, వార్డు ఆఫీసర్ శంకర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు లక్ష్మీ, చందునాయక్, రఘునాయక్, రజిత, భాస్కర్, కుమార్, కిషన్, శాంతి,చిన్న, సురేశ్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఆమనగల్లు మండలంలోని పలు గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే ను ఎంపీడీవో మాధురి పరిశీలించారు.

కడ్తాల్ : అర్హులైన నిరుపేదలందరికీ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని కాంగ్రెస్ యువజన మండల అధ్యక్షుడు బోసు రవి అన్నారు. కడ్తాల గ్రామ పంచాయతీ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను సోమవారం ఆయన పరిశీలించారు. సర్వేను పారదర్శకంగా చేపట్టాలని సర్వే అధికారులను కోరారు. ప్రజలు సర్వేకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అల్లాజీ, నాయకులు విజయ్, శ్రీకాంత్, చందు, సత్యం, పుష్పమ్మ తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి



సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

కేశంపేట, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలంటూ సోమవారం తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో మండల పంచాయతీ కార్మికులు మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ రవీందర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సిబ్బంది బకాయి వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికుల వేతనాలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయింపు చేయాలన్నారు, గ్రీన్ ఛానల్ ద్వార వేతనాలు చెల్లించాలని, గ్రామ పంచాయతీ కార్మికులను రెండవ పీఆర్సీ పరిధిలోని తీసుకవచ్చి, జీవో 60 ప్రకారం కేటగిరీల వారిగా వేతనాలు ఇవ్వాలన్నారు. మల్టీపర్పస్ విధానం రద్దు చేసి కారోబార్, బిల్ కలెక్టర్‌లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని కోరారు. ఉద్యోగ భద్రత, రూ. 5లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు రామచంద్రయ్య, రవి, పద్మమ్మ, పారేశా, జంగయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

వంట కార్మికుల సమ్మె.. విద్యార్థుల ఇక్కట్లు

యాచారం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం నుంచి మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మె చేస్తుండడంతో విద్యార్థులు అర్ధాకలితో అలమటించారు. వంట కార్మికులు సమ్మెలో ఉన్నట్లు తెలియక చాలా మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం కోసం ఎదురు చూడగా వంట లేదని తెలిసి తీవ్ర ఇబ్బందుల పాలయ్యారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని, పెరిగిన ధరలకనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని, నెలకు రూ. 10వేల వేతనాలందించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. వంటకార్మికులందరికీ యూనిఫాం ఇవ్వాలని, సామాజిక భద్రత కల్పించాలని కోరుతున్నారు. ప్రమాదబీమా ఈఎస్ఐ, పీఎఫ్, సౌకర్యం కల్పించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. ఎలాంటి షరత్తులు లేకుండా బ్యాంకుల ద్వారా రుణాలందించాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మె చేస్తుండడంతో విద్యార్థులకు తిప్పలు తప్పలేదు. దీంతో చేసేదేమీ లేక కొందరు విద్యార్థులు ఇంటి నుంచి భోజనం తెచ్చుకున్నారు.

వైభవంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

తలకొండపల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని రాంపూర్ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి వార్షిక, బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు. నిర్వాహకులు భక్తులకు విశాల వసతులు ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం దీపోత్సవం, బండ్ల తిరుగుట, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ విగ్రహంతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో ప్రజలు, భక్తులు పాల్గొని స్వామి వారికి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పవన్ కుమార్ రెడ్డి, ఈవో స్నేహలత, మాజీ సర్పంచ్ శ్యాంసుందర్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

మంచాల : పెండింగ్ బిల్లులు సత్వరమే చెల్లించి అప్పుల ఊబినుంచి బయటపడేయాలని సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు బి.నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సర్పంచుల ఫోరం అసెంబ్లీ ముట్టడికి సంబంధించి సోమవారం మంచాల మండల పరిధి వివిధ గ్రామాలకు చెందిన మాజీ సర్పంచులు ముందస్తుగా అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచులు నాగరాజు, జగన్‌రెడ్డి, పల్లాటి జగన్, అంబోత్‌రఘులు మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కోసం సర్పంచులు అప్పులు చేసి పనులు చేశారని బిల్లులన్నీ రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు.

షాద్‌నగర్ రూరల్ : దేవ దేవుడు పరమ శివుడి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం రామేశ్వరంలోని పవిత్ర శివాలయంలో సోమవారం తెల్లవారు జామున సతీ సమేతంగా, కార్యకర్తలతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ సంతోషంగా ఉండాలని, అందుకు దేవ దేవుడి ఆశిస్సులు ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. పౌర్ణమి మరుసటి రోజు శివుడికి మొదటి నుంచి పూజలు చేస్తామని అన్నారు.

షాబాద్ : రాజ్యసభ ఎంపీగా ఆర్. కృష్ణయ్య ప్రమాణస్వీకారం చేసిన అనంతరం ఢిల్లీలో బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ, నాయకులు అరుణ్ తదితరులు ఆయనను కలిశారు. ఈమేరకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కడ్తాల్ : మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామంలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. హైదరాబాద్ కామినేని ఆసుపత్రి సహకారంతో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్, జర్పుల రాధాకృష్ణ మెమోరియల్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేశారు. డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్ లతో కలిసి మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ ప్రారంభించారు. శిబిరం డాక్టర్ ఉప్పల అఖిల్ బృందం,కామినేని ఆసుపత్రి వైద్యులు 255 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామీణ పేదలకు ఉచిత వైద్యసేవలు అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు ముందుకు వచ్చి గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించి పేదలకు వైద్యసేవలు అందించాలని ఉప్పల వెంకటేశ్, దశరథ్ నాయక్, గంప వెంకటేశ్‌లు అన్నారు. మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, నాయకులు జోగు వీరయ్య, కృష్ణయ్య, మహేశ్‌యాదవ్, కంబాల రమేశ్, ప్రేమ్‌కుమార్, శ్రీను, కొప్పు కృష్ణ, పాండు, వగ్గు మహేశ్, కృష్ణ, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు : ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరంగా నిలుస్తుందని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జగన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వస్పుల మానయ్య, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్‌లు అన్నారు. ప్రజారోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ఆమనగల్లు మండలానికి చెందిన పది మంది లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.3.80 లక్షల మంజూరయ్యాయి. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో మంజూరైన చెక్కులను సోమవారం జగన్, మానయ్య, శ్రీకాంత్‌లు బాధిత కుటుంబాలకు అందజేశారు.

ఆమనగల్లు : నర్సరీలలో మొక్కల పెంపకం పనులు వేగవంతం చేయాలని ఎంపీడీవో కుసుమ మాధురి కోరారు. కూలీలు ఈజీఎస్ పనులను సద్వినియోగం చేసుకొని స్థానికంగా ఉపాధి పొందాలని సూచించారు. ఆమనగల్లు మండలం శెట్టిపల్లి, ఆకుతోటపల్లి గ్రామాలలో సోమవారం ఎంపీడీవో మాదురి పర్యటించారు. ఈజీఎస్ పనులను పరిశీలించారు. నర్సరీల పనులు వేగవంతంగా చేపట్టాలని ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో మాధవ రెడ్డి, పంచాయతీ ల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్‌వి కుట్ర రాజకీయాలు'

ఆమనగల్లు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అపఖ్రతిష్ఠ పాలు చేసి రాజకీయంగా లబ్ధి పొందేందుకు బీఆర్ఎస్ నాయకులు కుట్ర రాజకీయాలు సాగిస్తున్నారని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జగన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వస్పుల మానయ్య, యూత్ కాంగ్రెస్ అద్యక్షుడు వస్పుల శ్రీకాంత్ లు అన్నారు. ప్రజా విశ్వాసం కోల్పోయి అధికారానికి దూరమైన బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై విషం కక్కుతున్నారని మండిపడ్డారు. ఆమనగల్లు పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో జగన్, మానయ్య, శ్రీకాంత్ లు మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్ఎస్ నాయకులు ప్రగతి నిరోధకంగా మారారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డిని విమర్శించడం బీఆర్ఎస్ నాయకులు దినచర్యలో భాగంగా పెట్టుకున్నారని అన్నారు. సర్పంచ్‌ల పెండింగ్ బిల్లుల పాపం బీఆర్ఎస్ పార్టీదేనని ఆరోపించారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి మాజీ మంత్రి హరీశ్ రావు అసెంబ్లీలో సర్పంచ్‌ల పెండింగ్ బిల్లుల గూర్చి మొసలి కన్నీరు కారుస్తున్నారని అన్నారు. మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లుల కోసం అసెంబ్లీని వాకౌట్ చేయడం హస్యాస్పదమన్నారు. మార్కెట్ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, మాజీ సర్పంచ్ బాల్‌రామ్,నాయకులు ఖలీల్, మహేశ్, ఖాదర్ ఖాద్రీ, అలీం, కండె సాయి, రఫీ, నాజర్, తదితరులు ఉన్నారు.

ఒక్కరి నేత్రదానంతో ఇద్దరికి దృష్టిభాగ్యం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న పసుల లక్ష్మారెడ్డి

ఆమనగల్లు , డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఒక్కరి నేత్ర దానంతో ఇద్దరికి దృష్టి భాగ్యం కలుగుతుందని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి అన్నారు. మరణానంతరం నేత్ర దానం చేయడానికి ప్రతీ ఒక్కరు ముందుకు రావాలని ఆయన కోరారు. ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా అందత్వ నివారణ సంస్థ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కళావతి బాయి సహకారంతో ఆమనగల్లు లయన్స్‌క్లబ్, ఎనుగొండ రాంరెడ్డి లయన్స్ కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి ప్రారంభించారు. శిబిరంలో కంటి వైద్య సహాయకుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో 45 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 15 మందికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించి ఐఓఎల్ ఆపరేషన్ల నిమిత్తం ఎనుగొండ లయన్స్ కంటి ఆసుపత్రికి తరలించారు. నేత్ర సంరక్షణ, మరణానంతరం నేత్రదానంపై ప్రజలకు అవగాన కల్పించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టి ఉచిత నేత్రదానం ప్రజలకు అవగాన కల్పించాలన్నారు. కంటి చూపు మందగించిన వారికి మరియు వృద్ధులకు ఉచిత కంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వారికి ఆపరేషన్లు చేయించడం జరుగుతుందన్నారు. వైద్యులు డాక్టర్ పరిక్షీత్ నరేంద్ర, ఎంపీహెచ్‌ఈవో తిరుపతిరెడ్డి, క్లబ్ కార్యదర్శి దోనాదుల మహేశ్, జిల్లా చైర్మన్ జూలూరి రమేశ్, జిల్లా చైర్మన్ చంద్రశేకర్, గోపాల్, పీఆర్వో పాష, తదితరులు పాల్గొన్నారు.

గట్టిప్పలపల్లిని మండల కేంద్రం చేయాలి

- కలెక్టర్‌కు జేఏసీ నాయకుల వినతి

తలకొండపల్లి, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ జేఏసీ నాయకులు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని గట్టిప్పలపల్లి గ్రామ జేఏసీ నాయకులు వినతి పత్రం అందజేశారు. మండల కేంద్రంగా ఏర్పాటు గట్టిప్పలపల్లి గ్రామం అనుకూలంగా ఉందని తెలిపారు.



పాఠశాలకు కంప్యూటర్లు, సౌండ్ సిస్టమ్ వితరణ

కేశంపేట, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి) రోటరీ క్లబ్ ఆఫ్ సైబరాబాద్ తన ఉదారతను చాటుకుంది. సోమవారం మండల పరిధిలోని సంగెం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు రెండు కంప్యూటర్లు, సౌండ్ సిస్టమ్ వితరణ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు కంప్యూటర్ విద్య అందాలన్న ఉద్దేశంతో కంప్యూటర్లు, సౌండ్ సిస్టమ్‌లను వితరణ చేశామని క్లబ్ సభ్యులు తెలిపారు. విద్యార్థులకు సాంకేతిక విద్యా అందాలన్న ఉద్దేశంతో కంప్యూటర్లు బహూకరించినట్లు వారు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం చంద్రశేఖర్ ఉపాధ్యాయులు, క్లబ్ సభ్యులు అంజనీ, పుష్పలత, కుమారశెట్టి, ప్రసన్న, శివ జ్యోతి విద్యార్థులుర తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్షలు



శంషాబాద్ : చైతన్య కళాశాలను సందర్శించిన కలెక్టర్ నారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నం/ మొయినాబాద్ రూరల్/ శంషాబాద్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-2 3,4 పేపర్ పరీక్షలు ఇబ్రహీంపట్నం, మొయినాబాద్, శంషాబాద్ పరిధిలో సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. ఏసీపీ కేవీవీ రాజు పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే మొయినాబాద్ మండలంలో పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో 7 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. మొత్తం 5504 మందికి గాను 1425 మంది అభ్యర్థులు పరీక్ష రాసినట్లు మొయినాబాద్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుజీత్‌రెడ్డి తెలిపారు. చిలుకూరు రెవెన్యూ పరిధిలోని కేజీరెడ్డి, గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాలలు ప్రధాన రోడ్డుకు కిలో మీటరు దూరంలో ఉండడంతో మొదటి రోజు ఆదివారం పరీక్ష రాసేందుకు వచ్చిన అభ్యర్థులు ఇబ్బందులు పడ్డారు. దీనిని దృష్టిలో ఉంచుకొని రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు రోడ్డు నుంచి కళాశాలలకు అభ్యర్థులు వెళ్లేందుకు ఆటోలను ఏర్పాటు చేశారు. మొయినాబాద్ సీఐ పవన్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. అలాగే శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని శ్రీ చైతన్య కళాశాలలో జరుగుతున్న పరీక్షా కేంద్రాన్ని సోమవారం కలెక్టర్ నారాయణరెడ్డి సందర్శించారు. అభ్యర్థుల హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలోని వైద్య సదుపాయాలు మౌలిక సదుపాయాలను పరిశీలించారు. తహసీల్దార్ రవీందర్ దత్, ఎంపీడీవో మున్ని తదితరులు పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి



పశువులకు టీకాలు వేస్తున్న వైద్యుడు చంద్రశేఖర్‌రెడ్డి

షాబాద్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని పశువైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మద్దూర్ గ్రామంలో సోమవారం పశువైద్య శిబిరం నిర్వహించి పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ, నట్టల నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందస్తుగా పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించి, ఆరోగ్యంగా ఉండేలా చూడాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పాడి రైతులు ఉన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి పెద్దపీట



బస్ పాసులు అందిస్తున్న నాయకులు

కందుకూరు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఆ పార్టీ మండల కో-ఆర్డినేటర్ ఎండీ అఫ్జల్‌బేగ్‌లు అన్నారు. సోమవారం 80మంది దివ్యాంగులకు ఉచిత బస్సు పాసులను అందజేశారు. నాయకులు బొర్ర సురేష్, చెన్నకేశవస్వామి, కె.రూప్‌చందర్, మాధవరెడ్డి, దర్శన్, అంకగళ్ల బాలయ్య, పరికుప్పల బాబు, గంగుల సురేందర్‌రెడ్డి, ఆరోగ్యరెడ్డి, కె.మహేందర్, పాండు తదితరులు పాల్గొన్నారు.